క్లుప్తంగా

సీతంపేటలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కొండలరావు, ఎస్సై వెంకన్న

చింతకాని: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సీతంపేటలో అంబేడ్కర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నారపోగు కొండలరావు, ఎస్సై పొదిల వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధి పిల్లల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించటం అభినందనీయమన్నారు. ఎస్సై వెంకన్న రక్తదానం చేసి యువతలో స్ఫూర్తి నింపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాకోబు, అంబేడ్కర్ సేవా సంస్థ అధ్యక్షుడు నాగరాజు, ఆళ్ల రవీందర్, గ్రామ పెద్దలు నారాయణ, వీరబాబు, వెంకటరావు, చినరోశయ్య, బాబురావు, కొరివీరయ్య, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రాంబాబు, టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన నాయకులు



వైరా నుంచి హైదరాబాద్ వెళ్తున్న సిబ్బంది

వైరా: హైదరాబాద్ హుస్సేన్ సాగరతీరంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహ ప్రతిష్టా కార్యక్రమానికి వైరా మండలం నుంచి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ బస్సును ఎంపీపీ వేల్పుల పావని, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, తహసీల్దార్ నారపోగు అరుణ ప్రారంభించారు.

సీఐటీయూ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

మధిర: సామాజిక న్యాయాన్ని కాపాడాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మధిర పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు శీలం నరసింహారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. దేశంలో మతోన్మాదాన్ని ప్రేరేపించి విధ్వంసం సృష్టించాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పడకంటి మురళి, రైతు సంఘం జిల్లా నాయకులు మందా సైదులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వడ్రాణపు మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప జన్మదిన వేడుకలు



బస్వాపురంలో అయ్యప్ప విగ్రహానికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురం కనకదుర్గమ్మ గుడిలో గల అయ్యప్ప స్వామి పీఠంలో శుక్రవారం అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు (కేరళ విషు) నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి విగ్రహాన్ని పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి



నల్లపు నర్సయ్య (ఫైల్)

మధిర: మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు నల్లపు నర్సయ్య (100) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. నర్సయ్య మృతి పట్ల తహసీల్దార్ నల్లపు ప్రకాష్, పలువురు గ్రామ పెద్దలు సంతాపం తెలిపారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. భారత జాతిని బలోపేతం చేయడానికి అంబేడ్కర్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని, అదే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిలో అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



వైరా: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్



మధిరలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్ రాజు, ప్రజాప్రతినిధులు



కొణిజర్ల: పాఠశాలలో అంబేడ్కర్ వేషధారణలో బాలుడు, నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సత్తుపల్లిరూరల్: గంగారం 15వ బెటాలియన్‌లో.. నివాళులర్పిస్తున్న కమాండెంట్ సయ్యద్ జమీల్‌బాషా



చింతకాని: అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు



కల్లూరు: అంబేడ్కర్‌నగర్‌లో..



కల్లూరురూరల్: చిన్న కోరుకొండిలో..



ముదిగొండ: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ హరిప్రసాద్



వైరారూరల్: గన్నవరంలో..



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ శిరీష, జెడ్పీటీసీ కవిత, తదితరులు



వేంసూరు: భరణిపాడులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డీఆర్డీఓ శాస్త్రవేత్త కల్యాణి



బోనకల్: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పొంగులేటి వర్గీయులు



తల్లాడ: అంబేడ్కర్ నగర్‌లో..



పెనుబల్లి : నివాళులర్పిస్తున్న సీఐ సీహెచ్ హనూక్, ప్రజాప్రతినిధులు



కారేపల్లి: నివాళులర్పిస్తున్న హోలియా దాసరి సంఘం నాయకులు



వైరా : సిరిపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ సురేష్, తదితరులు



ఏన్కూరులో..

రామాలయంలో ప్రత్యేక పూజలు



సత్తుపల్లిటౌన్: రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సత్తుపల్లిరూరల్: రేజర్లలో సీతారామచంద్రస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్/సత్తుపల్లిటౌన్: మండలంలోని రేజర్ల రామాలయం, సత్తుపల్లిలోని శ్రీకొండడ రామాలయంలో సీతారాముల కల్యాణం జరిగిన 16 రోజుల పండుగ సందర్భంగా శుక్రవారం అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. రేజర్ల రామాలయంలో ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య ఆధ్వర్యంలో ఈ పండుగను వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామికి సుప్రభాత సేవ, 8 గంటలకు సేవా కాలంసంక్షేమ కార్యక్రమం భజన పూర్తైన తర్వాత స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా రామకృష్ణమాచార్య మాట్లాడుతూ.. ప్రతి పనికి మానవ ప్రయత్నంతో పాటు దైవానుగ్రహం ఉంటేనే ఆ పనిలో మనం ఆ పనిలో సఫలీకృతమవుతామని, దేవానుగ్రహం లేకుండా మనం ఏం సాధించలేమని, ఆయన అనుగ్రహం కోసం మనం చేసినటువంటి పూజ భజన అర్చన కల్యాణ మహాయజ్ఞయాగాదాలు మొదలైనటువంటి కార్యక్రమాలే మనకు శ్రీరామరక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బొల్లారెడ్డి సత్యనారాయణరెడ్డి, వసంతలక్ష్మి, ఒగ్గు పుల్లారెడ్డి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, గొర్ల చెన్నారెడ్డి, చింతల వెంకట్రావిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, పాల వెంకటరెడ్డి, చిరంజీవిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కల్లూరు: కల్లూరు ఎన్నెస్పీలోని కౌసర్ మసీదులో శుక్రవారం రాత్రి కల్లూరు మండల రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉయ్యూరు రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ప్రత్యేక ప్రార్థనల్లో రఘుపతి రెడ్డి పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మసీద్ సదర్ ఎస్‌కే బడేమియా, ముస్లిం ప్రముఖులు ఎస్‌కే సుభాని, ఎస్‌కే మధార్, సయ్యద్ అమీరుద్దీన్, ఎస్‌కే సైదా తదితరులు పాల్గొన్నారు.



తాటి ముంజలు కొనుగోలు చేస్తున్న ప్రయాణికులు

తాటి ముంజలకు భలే గిరాకీ

కల్లూరు రూరల్: వేసవి కాలంలో తాటి ముంజలు విరివిరిగా లభిస్తాయి. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు గాను ప్రజలు తాటి ముంజలను కొనుగోలు చేస్తున్నారు. కేవలం వేసవి కాలంలోనే అరుదుగా దొరికే ఈ తాటి ముంజలకు ఈ సీజన్‌లో ఎక్కువ గిరాకీ ఉంటుంది. శరీరాన్ని చల్లబరిచే తాటి ముంజలు ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తాయి. గత కొన్నేళ్లుగా తాటి చెట్లను నరకటం వలన తాటిచెట్లు కనుమరుగైనాయి. తాటి ముంజలు దజన్ ధర రూ.60లు నుంచి రూ.75ల వరకు పలుకుతుంది. అవికూడా అరుదుగానే దొరుకుతున్నాయి.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తి దాయకం..

సత్తుపల్లిరూరల్: పేద కుటుంబంలో జన్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన మేధా శక్తితో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి అన్నారు. సత్తుపల్లిలో కళాకృతి ఫైన్‌ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు గీసిన 100కుపైగా చిత్రాలను ప్రదర్శించారు. ఈ చిత్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకట్రావ్, ఆర్టిస్టులు బాలకృష్ణ, సాయిశ్రీ, సృజన నిర్వాహకులు మధుసూదన్ రాజు, నాగేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం విద్యుత్ ఏఈగా అనూష



బాధ్యతలు స్వీకరిస్తున్న అనూష

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈగా జి.అనూష శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్ డివిజన్ కార్యాలయంలో ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ ఏఈగా సెక్షన్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు గానూ కృషి చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

తల్లాడ: తల్లాడ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిలిపి వేయబడుతుందనీ ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలోని ప్రత్యామ్నాయ కాలువ వద్ద గల 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సబ్‌స్టేషన్ పరిధిలో గల సిద్దారంరోడ్ ఫీడర్, కాకర్లపల్లిరోడ్ ఫీడర్, తాళ్లమడ ఫీడర్‌లకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

12 రకాల సరుకులు ఇవ్వాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మహిళా సంఘం నాయకులు

కల్లూరు: రేషన్ షాపుల ద్వారా ప్రజలకు 12 రకాల నిత్యావసర సరుకులు ప్రభుత్వం ఉచితంగా అందించాలని మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కల్లూరులో పోస్టర్లు ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా కుటుంబ సమగ్ర సర్వే నిర్వహించిందని, దీంతో పేదలకు, ఇళ్ల స్థలాలు, ఇండ్లు, రేషన్‌కార్డులు, కొలువులు వస్తాయని ప్రజలు ఆశించారని, సర్వేలు జరిపి సంవత్సరాలు గడిచినా టీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని మహిళా సంఘం నాయకులు ఆరోపించారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మోదీ పాలనకు ముందు రూ.450 ఉన్న సిలెండర్ ధర ఇప్పుడు రూ.1,200 కు చేరుకుందని వాపోయారు. కార్యక్రమంలో మహిళా సంఘం కల్లూరు మండల నాయకులు రావూరి భూలక్ష్మి, ఖమ్మంపాటి రాధా, కుమారి, రమణ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



సత్యాగ్రహ సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని: మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సత్యాగ్రహ సభకు పార్టీ మండల నాయకులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగార్జున్, నాయకులు గోపి, వెంకటేశ్వర్లు, బసవయ్య, కోటేశ్వరరావు, రమేష్, కోటేశ్వరరావు, సుబ్బయ్య, సంజీవరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

నిరుపయోగంగా మండల పైకా భవనం



మండల కేంద్రమైన ముదిగొండ జెడ్పీఉన్నత పాఠశాలలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మండల పైకా భవనం నిరుపయోగంగా ఉంది. 2013లో రూ.5 లక్షలతో నిర్మించిన భవనంలో ఎలాంటి ఆట వస్తువులు లేక విద్యార్థులు ఆడుకోలేక పోతున్నారు. భవనాలకు తాళ్లాలు తీసే నాధుడే కరువైయ్యారని, భవనాల్లో ఆట వస్తువులు సమకూర్చి, ఉపయోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : ఇందిరాజ్యోతి, ఎంఈఓ, ముదిగొండ
సెల్ నంబర్ : 9908136503